సాక్షి
పల్నాడు
శనివారం, 3, జూన్, 2023



ముగిసిన పీసెట్ ప్రవేశ పరీక్షలు

ఏఎన్‌యూ : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఏపీ పీసెట్-2023 పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని కన్వీనర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు.



రబీ పసుపు కొనుగోలు

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రబీ పసుపు పంట కొనుగోలుకు నిర్ణయించినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మీ తెలిపారు. మద్దతు ధర రూ.6,850 నిర్ణయించినట్లు తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

న్యూస్‌రీల్

జననేతకు ఘన స్వాగతం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం గుంటూరు పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లోని హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ నేతలతోపాటు అధికారులు, ప్రముఖులు తరలివచ్చి సీఎంకు పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్ శామ్యూల్, గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజ్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చుట్టుగుంట సభాస్థలి వద్ద కూడా కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎంకు సాదర స్వాగతం పలికారు. జేసీ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ తదితరులు ఆహ్వానం పలికిన వారిలో ఉన్నారు.

కోటప్పకొండ ఇన్‌చార్జి ఈఓగా శ్రీనివాసరెడ్డి



మార్కాపురం: పల్నాడు జిల్లా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా మార్కాపురం లక్ష్మీచెన్న కేశవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కోటప్పకొండ ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, త్వరలో బాధ్యతలు స్వీకరిస్తానని శ్రీనివాసరెడ్డి చెప్పారు.

టెన్త్ సప్లిమెంటరీ ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్ : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 పరీక్షా కేంద్రాల పరిధిలో 438 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గుంటూరు నగర పరిధిలో నాలుగు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అదే విధంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 11 పరీక్షా కేంద్రాలతో పాటు ఒక స్టోరేజ్ పాయింట్‌ను విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా ఇంటర్ విద్యార్హత గల వారికి అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, టెన్త్ అర్హతతో అసెంబ్లీ ఆపరేటర్ (ఆర్ఏసీ) కోర్సుల్లో ఉచిత శిక్షణ కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఆసక్తి కలిగిన 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు కలిగిన అభ్యర్థులు ఏపీ ఎస్ఎస్‌డీసీ సైట్‌తో పాటు తమ ప్రతినిధి బి. రవికుమార్‌ను 63042 92828 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

91.82 శాతం ఫించన్ల పంపిణీ



నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి శుక్రవారం వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. వేలిముద్రలు, ఐరిస్ ఆధారంగా వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో శుక్రవారం నాటికి 91.82 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,51,264 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.02 కోట్లు కేటాయించింది. శుక్రవారం సాయంత్రానికి 2,30,708 మంది లబ్ధిదారులకు రూ.63.39 కోట్ల నగదు అందజేశారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఎన్ఎంఎంఎస్ ఫలితాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు గత ఫిబ్రవరి 5న నిర్వహించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షా ఫలితాలను విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షా ఫలితాలను డీఈవో కార్యాలయంతో పాటు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చునని, అర్హత సాధించిన విద్యార్థుల మెరిట్ కార్డులు త్వరంలో డీఈవో కార్యాలయానికి చేరుకుంటాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు తమ తల్లి, తండ్రితో జాయింట్‌గా సేవింగ్స్ ఖాతా తెరవాలని సూచించారు.

సేద్య వీరా సెల్యూట్



యంత్రహాసం



సస్య సందేశం : కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో మేరుగ నాగార్జున, మోపిదేవి వెంకటరమణారావు, నందిగం సురేష్, లేళ్ల అప్పిరెడ్డి, హెనీ క్రిస్టినా, మద్దాళి గిరి, కల్పలతారెడ్డి, కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్ తదితరులు

మండుటెండలో చల్లని స్పర్శ ఏదో స్పృశించినట్టు.. గుంటూరు పుడమితల్లి పులకించింది. ముత్యాల జల్లేదో కురిసినట్టు.. కర్షక సోదరులు పరవశించారు. వరాల తెమ్మెర సుతారంగా చెక్కిళ్లను తాకినట్టు.. లబ్ధిదారుల మోమున చిరునవ్వులు వికసించాయి. సంక్షేమ సూర్యుడే దిగివచ్చి సేద్యరథ సారథ్యం స్వీకరించినట్టు.. హలధారులు సంబరమై వెంట కదంతొక్కారు. ఖరీఫ్ సంరంభానికి సమరశంఖం పూరించినట్టు.. రైతు కనులు వెలుగుదివ్వెలై మెరిశాయి. 'మిషన్' కర్షక నినాదం మిన్నంటినట్టు.. సేద్యరంగం గళమెత్తి జయజయధ్వానాలు చేసింది.

- కన్నుల పండువగా యంత్ర సేవా పథకం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- రైతులకు యంత్రాలు అందజేసిన సీఎం
- ట్రాక్టర్, హార్వెస్టర్ నడిపి అబ్బురపరిచిన వైనం
- బారులు తీరిన వాహనాలు
- రైతుల మోముల్లో ఆనందం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్, పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ యంత్ర సేవా పథకం రెండో విడత పంపిణీకి గుంటూరు చుట్టుగుంట వరుసగా రెండో ఏడాదీ వేదికైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆద్యంతం అట్టహాసంగా జరిగిన యంత్రాల పంపిణీకి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. సంక్షేమ రేడును చూసేందుకు పోటీపడ్డారు. తొలుత వేదిక వద్దకు చేరుకోగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్రాక్టర్‌తోపాటు, హార్వెస్టర్‌ను నడిపి అందరినీ సంబరమాశ్చర్యాలకు గురిచేశారు. అనంతరం రాష్ట్రంలోని లబ్ధిదారులకు రూ.361.29 కోట్ల విలువైన 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 వ్యవసాయ పరికరాల పంపిణీ ప్రారంభించారు. వీటికి సంబంధించి రూ.125.48 కోట్ల సబ్సిడీ సొమ్మును బటన్ నొక్కి నేరుగా రైతు గ్రూపుల ఖాతాల్లోకి జమ చేశారు. రోహిణీకార్తె నేపథ్యంలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో కార్యక్రమ సమయాన్ని కుదించారు. ముఖ్యమంత్రి వేదిక మీదకు చేరుకున్న తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వెంటనే నేరుగా రైతులనుద్దేశించి ప్రసంగించారు. కేవలం ఆరు నిమిషాల్లోనే తన ప్రసంగం ముగించారు. వాహనాల పంపిణీని ప్రారంభించారు.

రైతులకు సకల సదుపాయాలు

నగరానికి విచ్చేసిన రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. మార్కెట్ యార్డు నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు 20 వాటర్ పాయింట్లు ఏర్పాటు చేసి రైతుల దాహార్తిని తీర్చింది. 5వేల మజ్జిగ ప్యాకెట్లు, 5 వేల స్నాక్స్ ప్యాకెట్లను అధికారులు పంపిణీ చేశారు. ఎనిమిది జిల్లాల నుంచి రైతులు ఒకరోజు ముందుగానే గుంటూరుకు చేరుకోవడంతో వారికి కావాల్సిన అన్ని వసతులతోపాటు, భోజన సదుపాయాన్ని జిల్లా యంత్రాంగం మిర్చియార్డులో సమకూర్చింది.

రైతుల ఆనందోత్సాహాలు

సీఎం వైఎస్ జగన్ సమక్షంలో యంత్రాలు తీసుకోవడంతో రైతుల మోముల్లో చిరునవ్వులు వెల్లివిరిశాయి. చుట్టుగుంట నుంచి యార్డు వరకు కర్షకులు వరుసగా వాహనాలపై నిలబడి ఆనందోత్సాహాలు చేశారు. జయహో జగన్ అంటూ జయజయధ్వానాలు పలికారు. తమ అభిమాన నాయకుడు వైఎస్ జగన్‌ను తదేకంగా చూస్తూ పదికాలల పాటు చల్లగా ఉండాలని దీవించారు. వాహనాలు వెళ్లే క్రమంలో ఏలూరు కొత్తముప్పర్రుకు చెందిన ఒక రైతు కుమారుడు గుర్రం శేఖర్ ముఖ్యమంత్రిని ఒక్క నిమిషం కలవాలని కోరడంతో అతడిని సీఎం అనుమతించారు. తాను అగ్రికల్చర్ పాలిటెక్నిక్, బీఏ చేశానని తనకు ఏదైనా ఆధారం చూపాలని కోరడంతో అతనికి ఉద్యోగం ఇవ్వాలని ఏలూరు కలెక్టర్‌ని సీఎం ఆదేశించారు.



రైతు రథసారథి : వరి కోత యంత్రాన్ని నడుపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సంక్షేమ శూరా వందనం



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నేతలు

కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అంజద్ బాషా, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ కమిషనర్ హరికిరణ్, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్, శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, కేఎస్ లక్ష్మణరావు, కల్పలతా రెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, శాసన సభ్యులు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, అన్నాబత్తుని శివ కుమార్, ఆళ్ళ రామకృష్ణారెడ్డి(ఆర్కే), మేకతోటి సుచరిత, నంబూరు శంకరరావు, కిలారి వెంకటరోశయ్య, ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జేసీ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారాం జనేయులు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు సజిల, బాల వజ్రబాబు, పార్టీ నాయకులు తాడిశెట్టి మురళీమోహన్, కత్తెర సురేష్ పాల్గొన్నారు.



శుభస్య సేద్యం: బటన్ నొక్కి సబ్సిడీ జమ చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జనాకర్షక నాయకుడు



సీఎం వైఎస్ జగన్ తోనే రైతులకు న్యాయం జరుగుతుంది. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోలేదు. రుణ మాఫీ పేరుతో మోసం చేసింది. సీఎం వైఎస్ జగన్ కర్షకుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారు. ఆయనే ఎప్పటికీ సీఎంగా ఉండాలి.

– సీహెచ్ మస్తాన్‌రెడ్డి, మేరికపూడి

జగనే సీఎంగా ఉండాలి



ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన రైతులకు అండగా నిలుస్తున్నారు. దేశంలో ఇన్ని పథకాలు అమలు చేసిన మరో సీఎం లేరు. ప్రజలు, రైతుల కన్నీళ్లు తుడుస్తున్నారు. ఎప్పటికీ ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటాను.

– దాసరి దేవదాసు
రైతు, కొండెపాడు

రైతుల మేలు కోరే నేత



రైతుల మేలు కోరే ఏకైన నేత సీఎం వైఎస్ జగన్ మాత్రమే. ప్రతి ఆర్బీకే పరిధిలో రైతులకు సబ్సిడీపై యంత్రాలు అందించారు. రైతుల కష్ట, సుఖాలను తెలుసుకుని కుటుంబ సభ్యునిగా ఆలోచిస్తూ భరోసాగా నిలుస్తున్నారు.

– షేక్ చిన్న ఆదాం సాహేబ్, ఎలవర్తిపాడు



స్వాగతం సుస్వాగతం : సీఎంకు స్వాగతం పలుకుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని





సీఎం ఆపన్న హస్తం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలువురి బాధితులకు ఆపన్నహస్తం అందించారు. శుక్రవారం గుంటూరు యంత్రసేవా పథకం ద్వారా వ్యవసాయ పరికరాల పంపిణీకి విచ్చేసిన ఆయనకు పలువురు తమ సమస్యలు చెప్పుకున్నారు. దీంతో వెంటనే స్పందించిన సీఎం పరిష్కారమార్గాలు చూపారు. థలసీమియా, లివర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ఫారూఖ్ వైద్యానికి రూ.లక్ష తక్షణ ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఫారూఖ్ ఆలీ కుటుంబ సభ్యులకు సాయం చెక్కు అందజేశారు.

– గుంటూరు వెస్ట్

యువకుడి దారుణ హత్య



మంగళగిరి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడిని వెంటాడి నరికి చంపిన దారుణ ఘటన శుక్రవారం మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇటీవల నవులూరు ఎంఎస్ఎస్ కాలనీలో రెండేళ్ల పాప లక్ష్మీ పద్మను తండ్రి గోపి నేలకేసి కొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. గోపి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గోపీని అదుపులోకి తీసుకుని నాలుగు రోజులుగా స్టేషన్‌లోనే ఉంచి విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోపి మేనమామ శివన్నారాయణ, మేనమామ కుమారుడు వెంకటకృష్ణ రోజూ స్టేషన్‌కు వచ్చి గోపీని కలుస్తున్నారు. ఇంటికి వెళ్లి గోపిపై ఫిర్యాదు వెనక్కి తీసుకుని అతడిని విడిపించాలని మౌనికపై ఒత్తిడి తెస్తున్నారు. మౌనిక పిన్ని కొడుకు వరహాల సాయిసందీప్(34) ఫిర్యాదు వెనక్కి తీసుకోవద్దని మౌనికకు అండగా నిలబడ్డాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం గోపి నివాసంలో సందీప్ తో శివన్నారాయణ, వెంకటకృష్ణ గొడవకు దిగారు. సందీప్ ఆవేశంలో శివన్నారాయణను నెట్టడంతో శివన్నారాయణ గోడ మీద పడ్డాడు. అతడికి గాయమైంది. ఇది చూసిన శివన్నారాయణ కుమారుడు వెంకటకృష్ణ ఇంటిలోని కొబ్బరిబొండాలు నరికే కత్తితో సందీప్ వెంటపడ్డాడు. గోపి ఇంటి వద్ద నుంచి సందీప్ పరిగెత్తగా వెంకటకృష్ణ వెంటపడి కిలోమీటరుకుపైగా దూరం ఉన్న అమరావతి టౌన్‌షిప్‌లోని క్రికెట్ స్టేడియం పక్కన కల సీడ్ యాక్సెస్ రోడ్డు వద్ద కత్తితో మెడ మీద నరికాడు. దీంతో సందీప్ కుప్పకూలిపోయాడు. స్థానికుల సమాచారంతో వెంటనే చేరుకున్న పోలీసులు కొన ఊపిరితో ఉన్న సందీప్‌ను చినకాకాని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా అతను అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిందితులు శివన్నారాయణ, వెంకటకృష్ణ పోలీసులకు లొంగిపోవడంతో సందీప్ మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్‌లా లోకేష్ యాత్ర

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ధ్వజం

సాక్షి,అమరావతి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పుత్రరత్నం లోకేష్‌కు పాలనపై ఏమాత్రం అనుభవం లేదని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి విమర్శించారు. చంద్రబాబు క్యాబినెట్‌లో ఆయన మంత్రిగా చేసినా ఐఏఎస్‌లు, ఇతర అధికారులే పనులు చక్కబెట్టేవారని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలో శుక్రవారం అప్పిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుభవారాహిత్యం ప్రస్తుతం లోకేష్‌ను వెంటాడుతోందని, అందుకే టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తుందనే విషయం చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీచేసి గెలవలేకపోయిన లోకేష్ మాటలను ప్రజలెవరూ నమ్మడం లేదని చెప్పారు. "వంద రోజుల పాదయాత్రకే లోకేష్‌కు శరీరం సహకరించట్లేదని, అందుకే సాయంత్రాలు తూతూమంత్రంగా ఈవెనింగ్ వాక్‌లా పాదయాత్రను సాగిస్తున్నారని, ఎండకు బయటకు వెళ్లకుండా ఏసీలోనే అధిక సమయం గడిపేస్తున్నారని అప్పిరెడ్డి ఎద్దేవా చేశారు.

ప్రగతి 'పట్టాలు'

- నరసరావుపేట రైల్వేస్టేషన్‌కు డబుల్‌లైన్
- గుంటూరు-గుంతకల్లు మధ్య డబుల్ లైన్‌తో రూపురేఖలు మారనున్న స్టేషన్
- సరుకుల ఎగుమతి, దిగుమతులకు సెలవు
- ఇకపై ప్రయాణికుల సేవలోనే..
- గుంటూరు, వినుకొండవైపుకు వెళ్లేందుకు రెండు ప్లాట్‌ఫామ్‌లు కేటాయింపు
- వచ్చే సెప్టెంబరు నాటికి పనులు పూర్తే లక్ష్యం



రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొన్నిరోజులుగా ఊపందుకున్నాయి. గుంటూరు-గుంతకల్లు మధ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.3,590 కోట్ల వ్యయంతో 426 కిలోమీటర్ల మేర చేపట్టిన డబుల్‌లైన్, విద్యుద్దీకరణ పనుల్లో భాగంగా నరసరావుపేట స్టేషన్ రూపురేఖలు మారబోతున్నాయి. విద్యుద్దీకరణ పనులు ఇప్పటికే పూర్తి కాగా, మరో లైన్ నిర్మాణ పనులతోపాటు ప్రయాణికుల అవసరార్థం మరో ప్లాట్‌ఫామ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ మార్గంలో గుంటూరు-దొనకొండ మధ్య ఉన్న 115 కిలోమీటర్ల పరిధిలో ఇప్పటికే 90 కిలోమీటర్ల మేర డబుల్‌లైను పనులు పూర్తయ్యాయి. నరసరావుపేట స్టేషన్‌లో గూడ్స్‌షెడ్‌ను తొలగించి ఆ ప్రదేశంలో మరో రైల్వే లైను, ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడున్న స్టేషన్‌మాస్టర్ రూమ్‌తో పాటు డబుల్‌లైన్ సిగ్నలింగ్ కంట్రోల్ ప్యానెల్ వ్యవస్థల ఏర్పాటుకు మరో కొత్త భవనం నిర్మించారు. స్టేషన్‌లో ప్రయాణికుల అవసరార్థం రెండుప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి ప్లాట్‌ఫామ్ వయా నరసరావుపేట మీదుగా గుంటూరు వైపునకు వెళ్ళే రైళ్లు, రెండో ప్లాట్‌ఫామ్‌ను వినుకొండవైపునకు వెళ్ళే రైళ్లు ఆగేందుకు ఉపయోగించనున్నారు. ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరో ప్లాట్‌ఫామ్‌కు చేరేందుకు మరో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయనున్నారు.

సరుకుల రాకపోకలకు సెలవు

ఇప్పటివరకు నరసరావుపేట స్టేషన్‌లో సరుకుల ఎగుమతి, దిగుమతి సేవలకు రైల్వే శాఖ స్వస్తి పలికింది. మరో నూతన లైను స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేయాల్సిరావటంతో గూడ్స్‌షెడ్డును తొలగించి ఆ ప్రదేశంలో రైల్వేలైను, ప్లాట్‌ఫాం నిర్మిస్తుంది. ఇకపై ఈ స్టేషన్ ప్రయాణికులకు మాత్రమే సేవలు అందించనుంది. సరుకుల దిగుమతి, ఎగుమతికి ఈ మార్గంలోని సాతులూరు వద్ద గూడ్స్ షెడ్డును ఏర్పాటు చేస్తున్నారు.

వచ్చే సెప్టెంబరు నాటికి పనులు పూర్తి

స్టేషన్ ఆధునికీకరణ పనులు వచ్చే సెప్టెంబరు నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయి. సాతులూరు వరకు డబుల్‌లైన్ పనులు పూర్తికాగా అక్కడి నుంచి నరసరావుపేట మీదుగా శావల్యాపురం వరకు చేయాల్సిన పనులు కూడా పూర్తిచేస్తాం. ఈ మార్గం మొత్తం రెండులైన్ల వ్యవస్థ పూర్తయితే ప్రయాణికులకు, సరుకుల ట్రాన్స్‌పోర్టు వ్యాపారులకు చాలా ప్రయోజనకరంగా ఉండనుంది.

– వి.రామలింగరాజు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, రైల్వేశాఖ

సైకిల్ తొక్కు.. ఆరోగ్యం పట్టు

- మారుతున్న సమాజధోరణి
- సైక్లింగ్‌కు అలవాటు పడుతున్న జనాలు
- పర్యావరణ హితంతో పాటు ఆరోగ్యానికి మేలు చేస్తుండటంతో మొగ్గు
- యువత కూడా సైకిల్ దారిలోనే..



గుంటూరువెస్ట్: సైక్లింగ్.. సదా ఆరోగ్యమని పదే పదే నిపుణులు చెబుతుంటారు. అయితే నిన్న మొన్నటి వరకూ చెవికెక్కించుకోని జనాలు కరోనా అనంతర పరిణామాల్లో ఎక్కువ మంది సైకిల్ వాడకాన్ని అలవాటు చేసుకుంటున్నారు. రోజూ సైకిల్ తొక్కుతున్నారు. ఇదే విషయాన్ని పర్యావేత్తలు కూడా నొక్కి చెబుతున్నారు. సంప్రదాయ ఇంధన వాహనాల వినియోగాన్ని తగ్గించి, సైకిల్ వాడకాన్ని పెంచాలని తద్వారా పర్యవరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెబుతున్నారు. ఏటా జూన్ మూడో తేదీన ప్రపంచ వ్యాప్తంగా సైకిల్ పండుగను జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అసలు సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు ఇప్పుడు తెలుసుకుందాం..

అన్నీ ప్రయోజనాలే..

ప్రతి రోజూ క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వ్యక్తిగత ఆరోగ్య పరంగా శరీర కండరాలు పరిపుష్టిగా తయారవుతాయి. రక్త ప్రసరణ సజావుగా సాగుతుంది. శరీరం కాస్త అలసటకు గురై ఆకలి, నిద్ర పెరుగుతుంది. జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. చిన్నారులు స్థూలకాయానికి గురికారు. కంటి చూపు మెరుగుపడుతుంది. మానసిక ప్రశాంతత చేకూరి చురుకైన ఆలోచనలు వస్తాయి. ప్రధానంగా గుండె జబ్బులు, క్యాన్సర్, షుగర్ వంటి వ్యాధులు దరిచేరవు. రవాణా ఖర్చులు అమితంగా తగ్గుతాయి. సామాజిక పరంగా పరిశీలిస్తే.. దేశ ఆర్థిక వ్యవస్థను సైకిల్ ద్వారా కాపాడవచ్చని పలువురు సైక్లిస్టులు చెబుతున్నారు. ప్రతి రోజూ విధులకు సైకిల్‌పై చేరుకోవడం ద్వారా ఇందనం పొదుపు అవుతుంది. నగరాలు, పట్టణాల్లో ప్రతి ఒక్కరూ సైకిల్‌పై విధులకు హాజరైతే రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ గణనీయంగా తగ్గుతుంది. వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.

నిద్రమాత్రలు అవసరం లేదని నిరూపిస్తూ..

ప్రతి ఏడాది సెప్టెంబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో జరిగే లడాక్ ఫెస్టివల్ నిద్రమాత్రలు అవసరం లేదని నిరూపిస్తుంది. తొమ్మిది రోజుల పాటు 200 కిలోమీటర్ల మేర జరిగే ఈ పండుగకు అప్పటికే నిద్రమాత్రలు అలవాటున్న 20 మందిని ఎంపిక చేస్తారు. వారితో ఉత్సాహంగా ఉదయం నుంచి సాయత్రం వరకు సైకిల్ తొక్కిస్తారు. ఫెస్టివల్ ముగిసే నాటికి నిద్రమాత్రలు మాత్రమే కాదు, పరుపు, దిండు అవసరం లేకుండానే నిద్ర పోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సైక్లింగ్ ఆరోగ్య ప్రదాయని అనే రుజువు చేసేందుకే ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తారు. ఈ ఫెస్టివల్‌కు విజయవాడ నుంచి ఎంతో మంది హాజరవుతుంటారు.

ఆస్పత్రి ఖర్చులు ఉండవని నిరూపించారు..

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్‌లో పని చేసే 400 మందికి కానిస్టేబుళ్లకు ఐదేళ్ల క్రితం సైకిళ్లు కొనిచ్చారు. వారు గతంలో ఏయే జబ్బులకు ఆస్పత్రికి వెళ్లారు, ఎంత ఖర్చు చేశారనే విషయాలను వారికి సైకిల్ ఇచ్చే ముందే ఉన్నతాధికారులు నోట్ చేసుకున్నారు. ఏడాది తరువాత పరిశీలిస్తే వారిలో ఏ ఒక్కరూ ఎలాంటి జబ్బుల బారిన పడలేదు. దీంతో ఆస్పత్రి ఖర్చులు లేనేలేవని ఈ వినూత్న ప్రయోగం ద్వారా నిరూపించారు.

యువతలోనూ పెరుగుతున్న క్రేజ్..

గడిచిన దశాబ్దకాలంలో ఎన్నో రకాల మోడల్స్‌లో సైకిల్స్ మార్కెట్‌లో అందుబాటులోకి రావడంతో నేటి తరం యువత సైకిల్‌పై మక్కువ చూపుతున్నారు. తయారీ విధానం, ఫీచర్స్ అనుగుణంగా ఒక్కో సైకిల్ రూ. 6 వేల నుంచి రూ. 25 వేల వరకు ధర పలుకుతున్నాయి. సైకింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వీలైన సైకిల్‌లు ధర రూ. లక్ష పైమాటే.

ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులు దోమలు

పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్

యడ్లపాడు: దోమలు ప్రజల ఆరోగ్యానికి ప్రథమ శత్రువులని..దోమల ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తాయని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ చెప్పారు. యడ్లపాడు 1, 2, కారుచోల గ్రామ సచివాలయాల్లో శుక్రవారం ఆయన సిబ్బందితో కలసి పర్యటించారు. కారుచోల గ్రామంలోని మురుగు నిలిచిన కాల్వల్లో అబెట్‌ను చల్లించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో పలు కుటుంబాలను కలిసి ఫ్రైడే -డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కొబ్బరిబొండాలు, పాతటైర్లు, రోళ్లు, మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉన్నందున దోమలు విస్తృతంగా పెరుగుతాయన్నారు. దోమల కాటు కారణంగా ప్రజలకు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి అనేక వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్లలోని అన్ని వస్తువుల్ని పొడిగా ఉంచుకోవడం వలన దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. రాత్రివేళ దోమతెరలను వాడాలన్నారు. లార్వాను మొదటి దశలోనే గుర్తించి వాటిని వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి క్షేత్రస్థాయిలో చైతన్యం చేశారు. ముందుగా యడ్లపాడు ప్రాథమిక వైద్యశాల నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీలోని రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాయక్, సీహెచ్‌వో పున్నారావు, ఎస్‌యూఓ నారాయణ, సూపర్‌వైజర్లు రాజశేఖర్, పెర్సీ పాల్గొన్నారు.

నేటి నుంచి కస్తూర్బా గాంధీ సిబ్బంది బదిలీల ప్రక్రియ

నరసరావుపేటఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది బదిలీలను చేపడుతున్నట్టు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డీఈఓ కె.శామ్యూల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీల నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేస్తామన్నారు. పూర్తిచేసిన బదిలీల దరఖాస్తులను ఈనెల 7వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. సీనియారిటీ లిస్ట్‌ను 10వ తేదీన ప్రకటించి, సిబ్బంది కోరుకున్న విధంగా కౌన్సెలింగ్ నిర్వహించి 12వ తేదీన బదిలీ ఉత్తర్వులు ఇస్తామన్నారు. సిబ్బంది తమ దరఖాస్తులను నిర్ణీత ఫార్మెట్‌లో ఈనెల 7వ తేదీలోగా అందజేయాలని సూచించారు. వివరాలకు 8074499649 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సత్తెనపల్లి టీడీపీలో లొల్లి

తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణకు బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి తలనొప్పిగా మారింది. అటు కన్నా కూడా అయిష్టంగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. ఆయన అనుచరులు సంబరాలు చేసుకుంటున్నారు. మరో వైపు సీనియర్ నాయకుడు కోడెల మరణానంతరం పార్టీనే నమ్ముకుని.. నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్న కోడెల శివరామ్ కన్నా రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీకి అండగా నిలిచిన తమ కుటుంబానికి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివరామ్ కోడెల అభిమానులతో, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు తన అనుచరులతో సమాలోచనల్లో మునిగిపోయారు.

- కన్నా రాకతో భగ్గుమన్న శివరామ్
- ఇదెక్కడి న్యాయమంటూ మండిపాటు
- అజ్ఞాతంలోకి వైవీ ఆంజనేయులు వర్గం
- పార్టీ అధిష్టానం మాటకే మన్నెం ఓటు



సంబరాల్లో కన్నా లక్ష్మీనారాయణ



అభిమానులతో సమాలోచనల్లో కోడెల శివరామ్

సత్తెనపల్లి: తెలుగుదేశం పార్టీలో కన్నా లక్ష్మీనారాయణ చేరినప్పటి నుంచి తగిన స్థానం ఇవ్వలేదని ఆయన అనుచరులు అసంతృప్తిగా ఉన్నారు. మూడు నెలల తర్వాత సత్తెనపల్లి నియోజకర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. దీంతో రానున్న ఎన్నికల్లో కన్నా పోటీ చేసేది సత్తెనపల్లి నియోజకవర్గం నుంచే అని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఇక్కడ నుంచి పోటీ చేసినా గెలుపు అసాధ్యమని, సొంత పార్టీ నుంచే ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉందని అంటున్నారు. దీనికి బలం చేకూరుస్తూ .. కన్నాను సత్తెనపల్లి ఇన్‌చార్జ్‌గా ప్రకటించి ఒక్క రోజు కూడా గడవక ముందే .. అక్కడ టీడీపీ ప్రధాన నేతగా ఉన్న కోడెల శివరాం తన అసంతృప్తిని బాహాటంగా ప్రకటించారు.

మూడేళ్లలో ఐదు నిమిషాల టైం ఇవ్వలేదు...

పల్నాడు రాజకీయాలను కనుసన్నలతో శాసించిన తమ తండ్రి కోడెల శివప్రసాద్ దూరమైన దు:ఖంలో ఉండి కూడా తెలుగుదేశం పార్టీకి అహర్నిశలు కష్టపడ్డామని, ఇప్పుడు కొత్తగా పార్టీలో చేరిన వారికి ఇన్‌చార్జిగా అవకాశం ఇచ్చారని కోడెల శివరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా మాట్లాడటానికి అమ్మ, నేను పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అపాయింట్‌మెంట్ అడుగుతున్నామని, కానీ అవకాశం ఇవ్వ లేదని చెప్పారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆంజనేయులు ద్వారా కూడా తమ వేదన చెప్పుకునే అవకాశం ఇవ్వాలని కోరినా కనికరించలేదన్నారు. కోడెల ఆశయాల కోసం, ఆయన అనుచరుల కోసం ఇక్కడే ఉంటానని, రానున్న ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి పోటీ చేసి గెలిచి తీరుతానని శివరామ్ ధీమా వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో తమ అనుచరులతో ఆయన అనేక దఫాలు సమాలోచనలు నిర్వహించారు.

వైవీ మౌనం..మన్నెం ఓకే

కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి పార్టీ పగ్గాలు అప్పగించిన తర్వాత మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు మౌనం దాల్చారు. ఆయన ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనలు చేయలేదు. ఇదే క్రమంలో కన్నా అనుచరులు పార్టీ కార్యాలయాల్లో సంబరాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమాలకు సైతం వైవీ ఆంజనేయులు దూరంగా ఉన్నారు. ప్రస్తుత పరిణామాలపై అంతర్గతంగా తమ శ్రేణులతో సమాలోచనలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన మరో నేత మన్నెం శివనాగమల్లేశ్వరరావు(అబ్బూరి మల్లి) పార్టీ అధిష్టానం నిర్ణయానికి జై కొట్టారు. పార్టీ నిర్ణయమే శిరోధార్యమని ప్రకటించి మౌనందాల్చారు.

కన్నాకు సంకటం....

సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా నియమించినందుకు సంతోషపడాలో.. వచ్చీ రాగానే అసమ్మతి సెగ రగిలినందుకు వేదన పడాలో అర్థం కాక కన్నా తల పట్టుకుంటున్నారని కొందరు నేతలు అంటున్నారు. మరో వైపు ఎవరైనా పార్టీకి కంకణబద్ధులుగా ఉండాలని, కావున కన్నా వెనుక ఉండి నడవాలని అంటున్నారు. మరి టీడీపీలో నెలకొన్న ఈ పరిస్థితులు ఎటు దారి తీస్తాయో వేచి చూడాలి.

జాతీయ ఈత పోటీలకు వివేక్‌గౌడ్ ఎంపిక



బాపట్ల: ఢిల్లీలో ఈ నెల 5వ తేదీ నుంచి జరిగే జాతీయ స్థాయి ఈత పోటీలకు బాపట్ల జూనియర్ కళాశాల విద్యార్థి ఉప్పాల జ్ఞానవివేక్‌గౌడ్ ఎంపికయ్యాడు. ఈ సంవత్సరం జనవరిలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఈత పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున పాల్గొన్న వివేక్ రెండు వెండి పతకాలు సాధించాడు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగే పోటీలలో పాల్గొనడానికి అవకాశం దొరికింది. వివేక్‌గౌడ్ జాతీయపోటీలకు ఎంపిక కావటంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సూర్యలంక తీరంలో వృద్ధుడు ఆత్మహత్యాయత్నం



బాపట్లటౌన్: సూర్యలంక సముద్రంలో మునిగి వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం సూర్యలంక సముద్రతీరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సుమారు 60 నుంచి 65 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు సూర్యలంక సముద్రతీరానికి వచ్చి అందరూ మునిగే ప్రదేశంలో కాకుండా దూరంగా వెళ్లి సముద్రంలోకి దిగాడు. అతడి ప్రవర్తనను గమనించిన తీరంలోని అవుట్ పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, కానిస్టేబుల్ పి.వెంకటరావు, హోంగార్డు ఎస్.నరసింహమూర్తి, గజ ఈతగాళ్లు సుబ్బారావు, కోటయ్యలు వెంటనే స్పందించి సముద్రంలోకి వెళ్లి వృద్ధుడిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఎండ ప్రభావంతోపాటు ఉప్పునీరు తాగడం వలన వృద్ధుడు నీరసంగా ఉండటాన్ని గమనించి వెంటనే ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వృద్ధుడి ఆరోగ్యం నిలకడగా ఉంది. వెంటనే స్పందించి వృద్ధుడిని కాపాడిన సిబ్బందిని, గజ ఈతగాళ్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తొలకరికి ముందుగా యాజమాన్య పద్ధతులు చేపట్టాలి



శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి

గుంటూరురూరల్: రైతులు తొలకరిలో ముందస్తు యాజమాన్య పద్ధతులు చేపట్టి ఆరోగ్యకరమైన అధిక దిగుబడులను సాధించవచ్చని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని కేవీకేలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతుకి దుక్కి నుంచి దిగుబడుల వరకు ఏది అవసరమో ముందుగా గుర్తించి పకడ్బంది ప్రణాళిక పర్యవేక్షణ వల్లనే పంట దిగుబడి పెరిగి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించగలరని తెలిపారు. రైతులకు ఇది ఖరీఫ్ సాగుగుకు సన్నద్ధమయ్యేందుకు సరైన సమయమని వివరించారు. ఖరీఫ్ పంటకాలం ప్రారంభంలో రైతులు వేసవి దుక్కులపై శ్రద్ధ పెట్టాలని కోరారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. భూసారం పెంపునకు పశుగ్రాసాన్ని పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలని చెప్పారు. భూసార పరిరక్షణకు సేంద్రియ ఎరువులు ఎంపిక చేసుకోవాలని సూచించారు.

కొండవీడు సందర్శన గొప్ప అనుభూతి

- పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్ రామచంద్రరావు
- కొండవీడుకోటను సందర్శించిన డీఎఫ్‌వో



సిబ్బందికి వెయిస్ట్‌కోటను పంపిణీ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: చారిత్రక కొండవీడుకోట ప్రాంతాన్ని సందర్శించిన ప్రతి ఒక్కరికీ గొప్ప మధురానుభూతిని కలిగించే పర్యాటక ప్రాంతంగా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్ రామచంద్రరావు తెలిపారు. యడ్లపాడు మండలంలోని కొండవీడు కోట ప్రాంతాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ పర్యాటకులకు అవసరమైన అన్ని వసతులు గుర్తించి ఒక్కొక్కటిగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వాగత ద్వారం పక్కనే కొండవీడు-నగరవనం గైడ్‌మ్యాప్ బోర్డును అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. కొండవీడుకోట సందర్శనకు వచ్చే వారికి కొండపై పర్యటించేందుకు ఈ మ్యాప్ వారికి గైడ్ చేస్తుందన్నారు.

అటవీ సిబ్బందికి డ్రస్‌కోడ్

కొండపై నిరంతరం పర్యవేక్షించే 20 మంది అటవీ సిబ్బందికి డ్రస్ కోడ్ (వెయిస్ట్‌కోటు)ను డీఎఫ్‌వో రామచంద్రరావు శుక్రవారం పంపిణీ చేశారు. సందర్శకులు అటవీ సిబ్బందిని సులభంగా గుర్తించి వారి సహాయాన్ని పొందేందుకు వీలుంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ, కొండవీడు బీట్ ఆఫీసర్ పురుషోత్తమరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో కంచేటి సాయి అరెస్టు

- హత్యాయత్నంకు సూత్రధారిగా విచారణలో వెల్లడి
- గతంలో ముగ్గురు అరెస్టు, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బ్రహ్మం

పెదకూరపాడు: మునుగోడులో ఓ వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో సూత్రధారిగా ఉన్న కంచేటి సాయిని అమరావతి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అమరావతి సీఐ బ్రహ్మం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగోడు గ్రామానికి చెందిన అబ్బినేని వెంకట నరసయ్య, అలియాస్ నాని, కొలికొండ వెంకటరావు, మేడ దుర్గారావు, కోనంకి వెంకట శివరావు, నల్లగొర్ల వెంకటేశ్వర్లు, కుంభా తాతారావు, మేడ ఏడుకొండలు, తాడిబోయిన మల్లికార్జునరావులు వాహనాల్లో ఆయిల్ దొంగతనం చేస్తుంటారు. ఈ క్రమంలో మునగోడు గ్రామానికి చెందిన గనపా సైదారెడ్డికి చెందిన వాహనంలో ఆయిల్ చోరీకి పాల్పడుతూ పట్టుబడ్డారు. ఆయిల్ దొంగలు సైదారెడ్డిని హత్య చేసేందుకు ఏప్రిల్ ఐదో తేదీన కారుతో ఢీకొట్టారు. సైదారెడ్డి ప్రాణాలతో తప్పించుకోని ఏప్రిల్ ఆరో తేదీన అమరావతి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. సైదారెడ్డి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కేసు ఎ-1, ఎ-3, ఎ-4గా ఉన్న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మరి కొంతమంది నిందితులు ముందస్తు బెయిల్ పొందారు. కేసులో ఎ-5గా ఉన్న కోనంకి వెంకట శివరావుని పోలీసులు విచారించారు. క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన కంచేటి సాయికి సైదారెడ్డికి గతంలో ఇసుక అక్రమంగా తరలించే విషయంలో గొడవలు ఉన్నాయి. ఇసుక అక్రమంగా తరలిస్తున్న సాయికి చెందిన వాహనాలను ఎస్ఈబీ అధికారులకు సమాచారం ఇచ్చి పట్టించాడు. ఈ క్రమంలో కంచేటి సాయి నిందితులను కలిసి సైదారెడ్డిని హత్య చేస్తే ఆర్థికంగా తన వంతు సహాయం ఇస్తానని చెప్పాడు. సైదారెడ్డిని హతమార్చేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడికావడంతో గుంటూరులోని తన నివాసం వద్ద కంచేటి సాయిని శుక్రవారం అరెస్టు చేసి సత్తెనపల్లి కోర్డుకు హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మరికొద్ది రోజుల్లో వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో శుక్రవారం ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి పెరిగింది. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. సాధారణ భక్తులు, ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు తరలివచ్చిన ఉభయదాతలు, నూతన వధూవరులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కళకళలాడింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. అమ్మవారికి అంతరాలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించే లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చనతో పాటు చండీహోమం, శాంతి కల్యాణం వంటి ఆర్జిత సేవల్లో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. ఉదయం 9 గంటల తర్వాత రద్దీ మరింత పెరిగింది. ఉదయం 11.40 గంటలకు అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తులు అరగంట పాటు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఎండ వేడిమి, వడగాడ్పుల నేపథ్యంలో క్యూలైన్‌లో కూలర్లు, ఫ్యాన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ ప్రాంగణంలో మజ్జిగ పంపిణీ చేశారు. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబలు క్యూలైన్లను పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలో భక్తులు పాల్గొనగా, ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ, దర్బారు సేవను ఆలయ అర్చకులు నిర్వహించారు.

దుర్గమ్మ సేవలో అన్‌స్టాపబుల్ చిత్ర యూనిట్

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను అన్‌స్టాపబుల్ చిత్ర యూనిట్ శుక్రవారం దర్శించుకుంది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన చిత్ర హీరో, బిగ్‌బాస్ సన్నీ, సప్తగిరి, నిర్మాత రంజిత్‌రావులతో పాటు మరి కొంత మంది విచ్చేయగా, ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, చైర్మన్ కర్నాటి రాంబాబు ప్రసాదాలను బహూకరించారు.

జీజీహెచ్‌లో ఎన్‌ఎంసీ తనిఖీలు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్‌లో శుక్రవారం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సభ్యులు ఢిల్లీకి చెందిన డాక్టర్ ఉమేష్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాస్ తనిఖీలు చేశారు. న్యూరోసర్జరీ వైద్య విభాగంలో, యూరాలజీ వైద్య విభాగంలో తనిఖీలు చేశారు. ప్రస్తుతం ఉన్న సూపర్‌స్పెషాలిటీ పీజీ సీట్లు రెన్యూవల్ చేసేందుకు వైద్య కళాశాల, ఆసుపత్రిలో సరిపడా వైద్య సౌకర్యాలు, బోధనా సిబ్బంది ఉన్నారా, లేరా అనే విషయాలు పరిశీలించారు.